క్లుప్తంగా

4న రక్తదాన శిబిరం

అయిజ: గద్వాల జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయం డీకే బంగ్లాలో జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ జన్మదినం సందర్భంగా గురువారం ఉదయం 7 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తునట్లు జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

ముగిసిన ఇంటర్వ్యూలు



మల్దకల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారి కృష్ణయ్య ఆధ్వర్యంలో మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభంకాగా వివిధ గ్రామాలకు చెందిన 41 మంది మైనార్టీ నిరుద్యోగులు హాజరయ్యారు. అభ్యర్థుల స్టడీ సర్టిఫికెట్స్, ఆధార్, ఆదాయం, కులం ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, నిరుద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెద్దొడ్డిలో మైసమ్మ దేవర ఉత్సవాలు



మల్దకల్: మండలంలోని పెద్దొడ్డిలో మైసమ్మ దేవర ఉత్సవాలను మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని మైసమ్మ ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, బంధుమిత్రులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పెద్దవీరన్న, ఎంపీటీసీ రాజులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దాచూరి రామిరెడ్డికి ఘన నివాళి



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) కార్యాలయంలో మంగళవారం యూటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. దాచూరి రామిరెడ్డి విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం అధ్యయనం, పోరాటాలు చేశారన్నారు. 16 ఏళ్లుగా సర్వీసును సైతం వదులుకొని ఉపాధ్యాయ ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు చక్రధర్, రమణ, మద్దిలేటి, బీచుపల్లి, సుదర్శన్, సురేష్ తదితరులు ఉన్నారు.

చోరీకి యత్నం.. కేసు నమోదు

గద్వాల క్రైం: తాళం వేసిన ఇంట్లోకి గుర్తు తెలియని దుండగుడు చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ రామస్వామి కథనం మేరకు పాత హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన అవిజ్‌హమ్మిద్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడంతో గుర్తు తెలియని దుండగుడు ఇంట్లోకి చొరబడి వస్తు సామగ్రి ఇతర వస్తువులను చోరీ చేసేందుకు ప్రయత్నించాడు. గమనించిన స్థానికులు కేకలు వేయడంతో పారిపోయాడు. ఎలాంటి వస్తువులు, నగదు చోరీ కాలేదని బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాల్‌పోస్టర్ల విడుదల

పెబ్బేరు రూరల్: బీఎస్పీ ఆధ్వర్యంలో తెలంగాణ భరోసా సభ వాల్‌పోస్టర్‌ను వనపర్తి జిల్లా బీఎస్పీ కన్వీనర్ బహుజన రమేష్ మంగళవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 తేదీన హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ భరోసా సభలో బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి పాల్గొంటున్నందున మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గూడెం ఎల్లస్వామి, నాయకులు ఆర్పీ భీసన్న, శ్రీనివాస్, భాస్కర్, రమేష్, లక్ష్మణ్, ముని తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధి నిర్ధారణ ఏదీ..?

- ఏడేళ్లుగా భవనానికే పరిమితం

గద్వాల వ్యవసాయం: పశువైద్యంపై సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. జిల్లాలో నిర్మించిన పశువ్యాధి నిర్ధారణ కేంద్రం నిరుపయోగంగా ఉంది. కనీస వసతులు కూడా కల్పించలేదు. పశువైద్యులు, టెక్నీషియన్ల నియామకం చేపట్టకపోవడంతో అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. రైతులు, పెంపకందారులకు ఇక్కట్లు తప్పడం లేదు.

మూగజీవాలలో వచ్చే వ్యాధులు

పశువులు, జీవాలు సీజనల్ వ్యాధులతో పాటు రకరకాల వ్యాధులకు గురవుతాయి. వ్యాధి నిర్ధారణకు రక్త, మూత్ర, పేడ పరీక్షలు చేయడం తప్పనిసరి. వాటి ఫలితాల ఆధారంగానే వైద్యులు మందులు ఇస్తారు. సాధారణంగా పశువులు డెర్మటైటిస్ (చర్మ సంబంధిత), పాదుగువాపు, పేడలో రక్తం, కడుపు ఉబ్బరం, పుర్రురోగం, విపరీతమైన దగ్గు, గాలికుంటు, జబ్బువాపు తదితర వ్యాధులబారిన పడతాయి. అదేవిధంగా జీవాలు (గొర్రెలు, మేకలు) నట్టలు, తదితర జబ్బుల బారిన పడతాయి. వ్యాధి నివారణ కోసం రక్త, మూత్ర, పాల, చర్మ పరీక్షలు చేస్తారు. వాటి ఫలితాల ఆధారంగానే మందులు ఇచ్చి, వైద్యం చేయాల్సి ఉంటుంది.

ప్రతి నియోజకవర్గంలో..

ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ స్థాయిల్లో లేకపోవడం వల్ల అటు వైద్యులు ఇటు రైతులు ఇబ్బందులు పడ్డారు. వ్యయ ప్రయాసాలతో మూగ జీవాల పెంపకందారులు ఉమ్మడి జిల్లా కేంద్రానికి వెళ్లేవారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం 2014లో ప్రతి నియోజకవర్గ కేంద్రంలో వ్యాధి నిర్ధారణ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గద్వాలలోని పశువైద్యశాల ఆవరణలో రూ.23.11 లక్షలతో పశువ్యాధి నిర్ధారణ కేంద్ర భవన నిర్మాణ పనులు ప్రారంభించగా 2015లో భవనం పనులు పూర్తయ్యాయి. అయితే ఇప్పటి వరకు కేంద్రానికి అవసరమయ్యే వసతులు (ల్యాబ్) కల్పించలేదు. టెక్నీషియన్ల, పశువైద్యుల నియామకాల ఊసే లేదు. భవనాన్ని ప్రస్తుతం జిల్లా మత్స్యశాఖ కార్యాలయంగా వినియోగించుకుంటున్నారు.



మల్దకల్ శివారులో గేదెలు, గొర్రెలు

తప్పని తిప్పలు

పశువైద్యశాలలు గ్రామాల్లో, నియోజకవర్గ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. అయితే పశువులు, జీవాలు జబ్బులకు గురైతే వాటి వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం ఇప్పటికి శాంపిల్స్‌ను మహబూబ్‌నగర్‌కు పంపించాల్సిందే. ఫలితాలు రావడానికి వారం రోజుల సమయం పడుతోంది. దీంతో అటు రైతులు, పెంపకందారులు, ఇటు పశువైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా వ్యాధి నిర్ధారణ అవకాశం లేకపోవడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో కర్నూలు, రాయచూర్ లాంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉందని పెంపకందారులు, పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నియోజకవర్గంలో పశువులు, జీవాల సంఖ్య	
ఆవులు	27,298
గేదెలు	25,124
గొర్రెలు	3,02,198
మేకలు	32,503

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం

జిల్లా పశువైద్యశాల ఏర్పాటుతో పాటు, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం నిర్మించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత ప్రతి జిల్లాకు డిప్యూటీ డైరెక్టర్ స్థాయిలో జిల్లా పశువైద్యశాల స్థాపించాలని వివరించాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పశువైద్యాధికారి

కొనసాగుతున్న కంటి పరీక్షలు



గట్టులోని ఆరగిద్ద కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు



సద్దలోనిపల్లిలో..

గట్టు: మండలంలోని ఆరగిద్ద, ఇందువాసి, యల్లందొడ్డి గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మూడు గ్రామాల్లో మొత్తం 425 మందికి కంటి పరీక్షలు, 22 మందికి అద్దాలను పంపిణీ చేయగా, 26 మందికి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యులు తెలిపారు. బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని మల్లంపల్లిలో ప్రారంభింస్తామని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సీహెచ్‌ఓ ఊసేని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, నర్సింహులు, సౌజన్య, సూపర్‌వైజర్లు స్వర్ణలత, బాలమ్మ, మక్సూద్, ఏఎన్‌ఎంలు రేష్మ, ఈశ్వరమ్మ, నర్మద, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని సద్దలోనిపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం సర్పంచు అశోక్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కృష్ణయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రతి రోజు 150 మందికి టోకన్లు ఇచ్చి కంటి పరీక్షలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయమ్మ, ప్రణీత, నవీన్‌కుమార్, స్వరూపరాణి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని బస్వాపురంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ శివరాములు ప్రారంభించారు. క్యాతురు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 163 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు

శాంతినగర్: రైతులు దళారులను ఆశ్రయించొద్దని ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం అన్నారు. వడ్డేపల్లి ప్రాథమిక సహకార సంఘం కార్యాలయ ఆవరణలో పీఏసీఎస్ అధ్యక్షుడు కోట్ల గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కొన్ని రోజులుగా రైతులు రూ.1600లకు మొక్కజొన్నలు దళారులకు విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో సీఎం కేసీఆర్ మొక్కజొన్న మద్దతుధర రూ.1962లు ప్రకటించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారన్నారు. కార్యక్రమంలో ఆర్డీఎస్ మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి, ఎంపీపీ రజిత, జెడ్పీటీసీ కాశపోగు రాజు, మున్సిపల్ చైర్మన్ కరుణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మిరెడ్డి, డైరెక్టర్లు వెంకట్రామన్‌గౌడ్, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు మహేష్, రామలింగయ్య, కౌన్సిలర్ రవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన



మల్దకల్‌లో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

మల్దకల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కార్యదర్శులు రాఘవేంద్ర, సత్యానారాయణలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులరైజ్ చేయడంతో పాటుగా పరస్పర బదిలీలు, స్పౌస్ బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆంజనేయులు, పరుషరాముడు, మారెప్ప, లావణ్య సరిత, కృష్ణవేణి అయ్యపురెడ్డి, హారిక తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: జేపీఎస్, ఓపీఎస్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆయా మండలాల పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహంకు వినతిపత్రం అందజేశారు. వడ్డేపల్లి ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఐదోరోజు సమ్మె చేస్తున్న వడ్డేపల్లి, రాజోళి, అయిజ మండలాల పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యే అబ్రహంను కలిసి సమస్యను విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్, అయిజ అధ్యక్షురాలు మానస, వడ్డేపల్లి లక్ష్మణ్, రాజోళి దుర్గాప్రసాద్, ఓపీఎస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, వసంత, ఫయాజ్, వినోద్, ప్రవీణ్‌కుమార్, అమర్‌నాథ్, లింగన్న, భీమేష్, రాజశేఖర్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

అకాలవర్షాలతో అన్నదాతల అవస్థలు

గట్టు: అకాల వర్షాలు అన్నదాతలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం 26 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మంగళవారం తెల్లవారు జామున నుంచి 9 గంటల వరకు కురిసిన వర్షానికి రైతులు కుదేలు అయ్యారు. రెండు, మూడు రోజులుగా అకాల వర్షాల కారణంగా కల్లాల్లో వరిధాన్యం తడిసింది. మరి కొన్ని రోజులు ఇలాగే కొనసాగితే గింజలు మొలకెత్తే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వరి కోతలు చేయని రైతులు పరిస్థితి మరోలా ఉంది. కళ్ల ముందే వరి పైరు నేల కొరిగి గింజలు రాలిపోయాయని వాపోయారు. కొన్ని చోట్ల ధాన్యం తడవకుండా కవర్లను కప్పుతు రైతులు అవస్థలు పడుతున్నారు. మిరప రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఉండవెల్లి: మండల కేంద్రంతో పాటు కంచుపాడు, తక్కశిల గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. కంచుపాడులో రేణుక ఎల్లమ్మ ఆలయంలో భక్తులు వర్షంలోనే అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. వివిధ గ్రామాల్లో వరి ధాన్యం తడిసింది. రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లు బురదమయంగా మారాయి. రాకపోకలకు అవస్థలు పడ్డారు.



గట్టులో మిరపను ఆరబెడుతున్న రైతులు

క్షేత్రాల అభివృద్ధికి కృషి



అయిజ: వ్యాస తత్వజ్ఞ తీర్థుల వారి క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామని మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థఅన్నారు. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండలంలోని వేణిసోంపురంలో వేణుగోపాల స్వామి ఆలయంతో పాటు రాఘవేంద్ర స్వామి బృందావనం, వ్యాస తత్వజ్ఞ తీర్థుల వారిని సుబుదేంద్ర తీర్థ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, బీజేపీ నాయకులు నరసింహయ్యశెట్టి, ప్రదీప్ కుమార్, లక్ష్మణ్‌గౌడ్, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి చందూరు నాగప్ప నాయుడు ఫంక్షన్ హాల్‌లో బుధవారం సాయంత్రం గం.04–00 లకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్సై గోకారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారిపై బీచుపల్లి నుంచి పుల్లూరు టోల్‌ప్లాజా వరకు ఉన్న 22 గ్రామాల ప్రజా ప్రతినిధులు, యువత, హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులు, 108 సిబ్బంది, వ్యాపార సముదాయాలు, దాబాలు, హోటల్స్ యజమానులు, సిబ్బందికి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలి



శాంతినగర్: కొత్తగా ఏర్పడిన తిమ్మాజిపల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు మంగళవారం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో వీధి దీపాలు, తాగునీరు సమస్యలతో సతమతమవుతున్నామని పేర్కొన్నారు. పారిశుద్య కార్మికులు జీతాలు రాక వారం రోజులుగా విధులు బహిష్కరించారని దీంతో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సమన్వయ లోపంతో అభివృద్ధి కుంటుపడుతోందని అధికారులకు వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాగేష్ యాదవ్, గొనింటి వీరేష్, ఉప సర్పంచ్ ఆంజనేయులు, శంకర్, కుమార్, గోవర్ధన్, తిమ్మప్ప, రామాంజనేయులు, రంగస్వామిలు పాల్గొన్నారు.

7న తెలంగాణ భరోసా సభ

అయిజ: ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో తెలంగాణ భరోసా సభ నిర్వహిస్తునట్లు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. సభకు బీఎస్పీ అధినేత కుమారి మాయావతి హాజరవుతారన్నారు. దొరల గడీల పాలన నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని విముక్తి చేసేందుకు కార్యకర్తలు అధిక సంఖ్యలో నీలి జెండాలతో కదిలి రావాలని కోరారు. సమావేశంలో గద్వాల నియోజకవర్గం అధ్యక్షుడు రాజు, అలంపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ మధుసూదన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, అయిజ మండల ఇన్‌చార్జ్ ప్రేమకుమార్, మండల కన్వీనర్ హనుమన్న, పట్టణ కార్యదర్శి రవి, స్వామిదాసు, చిన్న, ధను, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం కల్యాణలక్ష్మి

మల్దకల్: ఆడపిల్లల తల్లిదండ్రులకు కల్యాణలక్ష్మి పథకం ఓ వరంగా మారిందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల, రైతుల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. వివిధ గ్రామాలకు చెందిన 131మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అలాగే సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అంతకు ముందు గుండె ఆపరేషన్ చేయించుకున్న రైతుబంధు మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిని మల్దకల్‌లోని తన నివాసంలోఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ రాజారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వైస్ ఎంపీపీ పెద్దవీరన్న, సర్పంచులు యాకోబు, వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు వెంకటన్న, సత్యారెడ్డి, విక్రంసింహారెడ్డి, చక్రధర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్, సవారి, గోపాల్‌రెడ్డి రాంచంద్రారెడ్డి, నర్సింహ్మారెడ్డి, కృష్ణారెడ్డి, అజయ్, మధు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల: జిల్లా గ్రంథాలయంలో నూతన వసతులు ఏర్పాటు చేసి, అన్ని హంగులతో ఆధునీకరిస్తున్నామని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గ్రంథాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ విభాగాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సకల సౌకర్యాలతో కూడిన లైబ్రరీ నూతన భవనాన్ని నిర్మిస్తామన్నారు. పాఠకులు, విద్యార్థుల కోసం 'ఆన్ డిమాండ్' ఉన్న ఉపయుక్తమైన పుస్తకాలను అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా గ్రంథాలయ అధికారి రామంజనేయులు, ఎంపీపీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మద్దూరు గ్రామస్తులు

మానవపాడు: తుంగభద్ర వరద బాధితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మద్దూరు సర్పంచ్ లక్ష్మీదేవి, నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు ఎమ్మెల్యేతో మంగళవారం కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందించారు. 2009 సంవత్సరంలో తుంగభద్ర నది వరదల కారణంగా గ్రామస్తులు సర్వం కోల్పోయారని పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వం వరద బాధితుల ఇళ్ల నిర్మాణం కోసం 30 ఎకరాల 16 గుంటల స్థలం సేకరించారని తెలిపారు. లే అవుట్ వేయించి లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు పంపిణీ చేయాలని జిల్లా అధికారులు ఆదేశాలు ఇచ్చినా ఇప్పటివరకు ఇవ్వలేదని వివరించారు. నేటివరకు తుంగభద్ర ముంపుప్రాంత మద్దూరు ప్రజలు నివాసగృహాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందిస్తూ త్వరలో బాధితులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి జిల్లా స్థాయి క్రీడా పోటీలు

ఎర్రవల్లిచౌరస్తా: అయిజ మండల కేంద్రంలో జిల్లా స్థాయి ఓపెన్ క్రికెట్, జూనియర్ కబడ్డీ పోటీలను స్వేరోస్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆర్గనైజేషన్ కన్వీనర్ డాక్టర్ సాల పోగుల స్వాములు తెలిపారు. మంగళవారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తా క్రీడా ప్రాంగణంలో టోర్నమెంట్ పోటీలపై యువతకు ప్రచారం నిర్వహించి కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ క్రికెట్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.40వేలు, రెండో బహుమతి రూ.30 వేలు అందజేస్తామన్నారు. అదేవిధంగా జూనియర్ కబడ్డీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.40వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30వేలు, మూడో బహుమతి రూ. 20 వేలు, నాల్గో బహుమతి రూ.10 వేలు ఉంటాయని వివరించారు. క్రికెట్ పోటీలో పాల్గొనే జట్లు 6వ తేదీలోగా, జూనియర్ కబడ్డీ టీమ్ సభ్యులు 12వ తేదీ లోగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9966977672, 9985337551 నంబర్లను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వేరో నాయకులు అనిల్, శేఖర్, ప్రవీణ్‌కుమార్, జాన్ వెస్లీ, బీసన్న, రామ్, లక్ష్మన్, తదితరులు ఉన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న స్వాములు

పప్పుశనగ పంటల వివరాలు సేకరణ



అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

మానవపాడు: కృష్ణానది బ్యాక్ వాటర్ తీరప్రాంతం చందూరులో మంగళవారం వ్యవసాయ విస్తరణ అధికారి మణిప్రకాశ్, సర్పంచ్ నరసింహులు ఆధ్వర్యంలో పప్పుశనగ పంటల వివరాల సేకరించారు. ఈ సందర్భంగా రైతులకు వారు అవగాహన కల్పించారు. రైతులు సాగుచేసిన పప్పుశనగ వివరాలను తెలపాలని పేర్కొన్నారు. ప్రతి పంట ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి అని తెలిపారు. అదేవిధంగా మండలంలోని పల్లెపాడులో కృష్ణానది బ్యాక్‌వాటర్ కింద సాగు చేసిన శనగపంటల వివరాలను రైతులు అందించాలని మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ ధరణిషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని శనగ పంటల వివరాలు వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు, సర్పంచ్‌కు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వీఓఏల నిరసన



మల్దకల్‌లో సమ్మె చేస్తున్న వీఓఏలు

మల్దకల్: వీఓఏల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం మండల నాయకులు భాష, చంద్రాములు మాట్లాడుతూ వీఓఏలకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు గోవిందు, హనుమంతు, కృష్ణ, వెంకట్రాములు, అపర్ణ, నవీన, ఎస్తేర్, తిరుమలేష్, జనార్ధన్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: ఐకేపీ వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు తిమ్మన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన సమ్మె మంగవారంతో 16వ రోజుకు చేరింది. వీఓఏలకు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు కామారెడ్డి జిల్లాకు చెందిన వీఓఏ వీరయ్య మృతిపై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.10లక్షల ఆర్థికసాయం అందజేయాలన్నారు. కార్యక్రమంలో వీఓఏలు ఎండీ జావిద్, వెంకట్రామయ్య, శంకర్ యాదవ్, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న వీఓఏలు

భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షలు

కొత్తకోట: కార్మిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భవన ఇతర నిర్మాణ కార్మికులకు మున్సిపల్ కార్యాలయంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, షుగర్, చెవి, కంటి పరీక్ష, ఊపిరితిత్తుల పనితనం, మూత్ర, గుండె పరీక్షతో పాటు మిగతా పరీక్షలను వైద్యుల పర్యవేక్షణలో చేసి సలహాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా లేబర్ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ.. బీఓసీ కార్డు కలిగిన భవన నిర్మాణ కార్మికులకు ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే కార్మిక శాఖ తరపున రూ. లక్షతో పాటు దహన సంస్కారాల కోసం రూ. 30 వేలు అందుతాయని తెలిపారు. అంతేగాక కార్మిక శాఖ నుంచి ఆడ పిల్లల వివాహ సమయంలో రూ. 30 వేలు ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ సుఖేశిని, కమిషనర్ శ్రీనివాసులు, విశ్వేశ్వర్, వైద్యులు దశరథం, నరేష్, చిన్న ఆశన్న, రవిసాగర్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు